క్లుప్తంగా

దెబ్బతిన్న ఇళ్ల సర్వే



పోతారం(ఎస్)లో కూలిన ఇల్లును పరిశీలిస్తున్న తహసీల్దార్ రవీందర్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: మండలంలో కురుస్తున్న వర్షాలకు నివాస గృహాలు కూలి పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తన సిబ్బందితో ఆయా గ్రామాల్లో సర్వే చేయించారు. మండలంలోని 17 గ్రామాల్లో పాక్షికంగా 26 ఇళ్లు కూలినట్లు తహసీల్దార్ తెలిపారు. కలెక్టర్‌కు నివేదించి ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారాన్ని బాధిత కుటుంబాలకు అందించనున్నట్లు పేర్కొన్నారు.

భవిష్యత్ కోసం కష్టపడాలి



మాట్లాడుతున్న సీఐ శ్రీను

మద్దూరు(హుస్నాబాద్): విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ కోసం కష్టపడి చదవాలని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. సోమవారం మండలంలోని లద్నూరు ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీ చెప్పకూడదన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని పోస్ట్ చేయకూడదన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జగదీశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త చెరువుకు హద్దులు నిర్ణయించండి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న బీఎస్పీ నాయకులు

హుస్నాబాద్: పట్టణంలోని కొత్త చెరువుకు సంబంధించి నీటి పారుదల శాఖ అధికారుల ఆధ్వర్యంలో హద్దులు నిర్ణయించేలా చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకులు తెలిపారు. కలెక్టర్ మనుచౌదరికి సోమవారం వినతి పత్రం ఇచ్చారు. చెరువుకు సంబంధించిన భూమి ఆక్రమణకు గురవుతుందని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులు నిర్ణయించాలని కోరారు. 2011 నుంచి ఇరిగేషన్ అధికారులు హద్దులు నిర్ణయించకపోవడం వల్ల నిర్మాణాలు వెలుస్తున్నాయని తెలిపారు. అక్రమ నిర్మాణాలపై అధికారులతో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, నాయకులు శంకర్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు బీఆర్ఎస్ అండ



చెక్కు అందిస్తున్న ప్రతాప్‌రెడ్డి, నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కుకునూర్‌పల్లి మండలం ఎల్లాయిగూడకు చెందిన పార్టీ కార్యకర్త మాసపాక స్వామి కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. పార్టీ ప్రమాద బీమా ఉండడం వల్ల పార్టీ నుంచి రూ. 2 లక్షల బీమా చెక్కును సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 360 మందికి పార్టీ ప్రమాదబీమా ద్వారా చెక్కులు అందించినట్లు తెలిపారు.

పాక్షికంగా కూలిన ఇళ్లు 22

అక్కన్నపేట(హుస్నాబాద్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అక్కన్నపేట మండలవ్యాప్తంగా 22 ఇళ్లు పాక్షికంగా కూలినట్లు ఎంపీడీఓ భానోతు జయరాం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వివరాలన్నీ జిల్లా ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.

క్రీడా పోటీలు వాయిదా

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి నిర్వహించాల్సిన మండల స్థాయి క్రీడా పోటీలను వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు మండల విద్యాధికారి యాదవరెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను తిరిగి 19 నుంచి 23 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వ్యవసాయ మోటార్ల వద్ద జరభద్రం!

- వర్షాల వేళ అప్రమత్తతతోనే తప్పనున్న ముప్పు



చిన్నకోడూరు(సిద్దిపేట): ఏటా వర్షాకాలం విద్యుదాఘాతంతో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈసారీ భారీ వర్షాలు కురుస్తున్న వేళ విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలున్నాయి. ప్రజలు, రైతులు అప్రమత్తం కావాల్సిన సమయం ఇది. వ్యవసాయ మోటార్లను సొంతంగా మరమ్మతులు చేసుకోవడం వల్ల ప్రమాదాల బారిన పడే అవకాశం లేకపోలేదు. ఏటా వానాకాలంలో చిన్న పొరపాట్లు, అజాగ్రత్త వల్ల విద్యుత్, ప్రమాదాలు వంటివి జరుగుతుంటాయి. ఇలాంటి ఘటనలు బాధిత కుటుంబాలకు తీరని వ్యథ మిగుల్చుతున్నాయి. విద్యుత్ విషయంలో కనీస అవగాహన ఉండి, జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

> **జాగ్రత్తలు తీసుకోవాలి**
>
> విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇంట్లో, వ్యవసాయ పంప్ సెట్ మోటార్లకు ఎర్త్ ఉండేలా చూసుకోవాలి. వానలు కురుస్తున్నందున ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉంటే వీటిని నివారించవచ్చు. అధికారుల సూచనలు పాటించాలి.
>
> -రమేశ్ రాజ్, విద్యుత్ ఏఈ

ఇలా చేస్తే ..

- విద్యుత్ మీటర్లు, స్విచ్‌బోర్డులు వర్షానికి తడవకుండా చూసుకోవాలి. తడి చేతులతో విద్యుత్ సరఫరా అయ్యే పరికరాలు, హోల్డర్‌లు, సర్వీస్ వైర్లు, స్విచ్‌లు తాకొద్దు.
- పంప్ సెట్లు వర్షానికి తడవకుండా కవర్లు కప్పేలా చూసుకోవాలి. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు తప్పనిసరిగా ఎర్త్ ఉండాలి.
- విద్యుత్ మోటారు తీగలు బురదలో లేకుండా చూసుకోవాలి. తీగలు తెగిపడితే లైన్‌మెన్‌కు సమాచారం ఇవ్వాలి. విద్యుత్ మోటార్లు తడి చేతులతో తాకొద్దు.
- విద్యుత్ మోటార్లు, స్టార్టర్ల చుట్టూ పిచ్చి మొక్కలు, పొదలు తొలగించాలి.
- స్టార్టర్‌ను పొడి ప్రదేశంలో ఉంచాలి. రక్షణగా కవర్లు ఉండాలి. తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకరాదు.
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సొంతంగా మరమ్మతులు చేయకూడదు.
- విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత సిబ్బందికి తెలియజేయాలి.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తప్పనిసరి



నంగునూరు(సిద్దిపేట): సామూహిక సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

నంగునూరు(సిద్దిపేట): గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం అందజేయడంతోపాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ కనబర్చాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ చాయాదేవి, పోషణ్ అభియాన్ అధికారి శ్రీనివాస్ అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పాలమాకులలో సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తోందన్నారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించి వ్యాక్సిన్లు వేయించాలన్నారు. ఆహారం, పాలు, గుడ్లు, ఆకుకూరలు, కూరగాయలతో భోజనం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రజిత, టీచర్లు రోహిణ, రజిత, నర్సవ్వ, పంచాయతీ కార్యదర్శి అనిత, మహిళలు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): పోషకాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్ రాణి అన్నారు. మండల పరిధిలోని మర్పడ్గ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుల్తానా, కార్యదర్శి పద్మ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

సత్వరమే సమస్యలు పరిష్కరించాల్సిందే

- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్



బాలసదనంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటజోన్: పట్టణంలోని ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక 28వ వార్డులో పర్యటించారు. మురుగు కాలువలను శుభ్రం చేయాలని సూచించారు. బాలసదనంలో వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, యూజీడీ ద్వారా నీటి సరఫరా పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం రైతుబజార్‌ను సందర్శించి మిగిలిన కూరగాయలు, తడిచెత్త ద్వారా బయో గ్యాస్ తయారీ ప్లాంట్ తిరిగి వినియోగంలోకి తేవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డులో కంపోస్టు పిట్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లికార్జున్, అధికారులు వనిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు 'అభయ'

- ట్రాఫిక్ సీఐ మురళి



ఆటోడ్రైవర్లకు అభయ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ మురళి

గజ్వేల్: ఆటోలలో ప్రయాణించే మహిళల రక్షణ కోసం ప్రభుత్వం నూతనంగా అభయ యాప్ రూపొందించిందని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గజ్వేల్, ప్రజ్ఞాపూర్ చౌరస్తాల వద్ద సోమవారం అభయ యాప్‌పై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. క్రమశిక్షణ గల డ్రైవర్‌గా ప్రయాణికులతో మర్యాదగా ప్రవరిస్తూ వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలని సూచించారు. ఆటోలలో పెద్దగా శబ్దం వచ్చేలా పాటల సౌండ్ పెట్టి ఇతరులకు ఇబ్బందులు కలిగించకూడదన్నారు. ప్రతీ ఆటోకు ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. యాప్‌కు సంబంధించిన స్టిక్కర్లను ఆటో డ్రైవర్లకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ వెంకట్రామ్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సాంబశివరావు, ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 15 జీవాల మృత్యువాత

సిద్దిపేటరూరల్: కుక్కలు దాడిలో గొర్రెలు 15 మృతిచెందాయి. ఈ సంఘటన నారాయణరావుపేట మండలంలో జరిగింది. బాధితుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జక్కాపూర్‌లో గుండెల్లి ఎల్లయ్య, కొమురయ్య గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవినం సాగిస్తున్నారు. రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి కూడా వ్యవసాయ బావి సమీపాన ఉన్న కోష్టంలో జీవాలను తోలారు. సోమవారం తెల్లావారుజమున కుక్కలు చొరబడి దాడి చేయగా 15 జీవాలు మృత్యువాత పడ్డాయి. విలువ రూ. 2లక్షల వరకు ఉంటుందని బాధితులు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇద్దరికి రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు.

మహేశ్ కుమార్‌గౌడ్‌కు సన్మానం



మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కాంగ్రెస్ సిద్దిపేట ఇన్‌చార్జి హరికృష్ణ తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ సన్మానించారు. ఇటీవల పీసీసీ అధ్యక్షుడిగా గౌడ్ నియమితులు కాగా హైదరాబాద్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హన్మంతారావు, పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, సుప్రభాత్‌రావు, బొమ్మల యాదగిరి, కలీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారనా్నరు.

తూతూమంత్రంగా ప్రజావేదిక



మాట్లాడుతున్న అదనపు డీఆర్డీఓ బాలకృష్ణ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మండల సామాజిక తనిఖీ ప్రజావేదిక తూతూమంత్రంగా సాగింది. అదనపు డీఆర్డీఓ బాలకృష్ణ, ఏపీడీ శివాజీ, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ శ్వేత, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ సంతోషలు పాల్గొన్నారు. 2023–24 లో ఉపాధి ద్వారా మండల వ్యాప్తంగా సుమారుగా రూ.7కోట్ల పనులను చేపట్టారు. కూలీలు పనికి రాకుండానే వారి పేరిట బిల్లులు, సుమారుగా 5 వేల మొక్కలు నాటి 7 వేల మొక్కలు బతికి ఉన్నట్లు వాటికి వాటర్ బిల్లులు డ్రా చేయడంపై విచారించారు. చాలా గ్రామాల్లో ఉపాధి రికార్డులు, క్యాష్ బుక్‌లు సరిగ్గా లేవని, ఉపాధి పని కల్పించాలని కూలీలు విన్నవించుకున్నా పని కల్పించలేదని గుర్తించారు. అనంతరం అదనపు డీఆర్డీఓ బాలకృష్ణ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలను మందలించారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానోతు జయరాం, ఎంపీఓ కవికుమార్, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులను నియమించండి



సభ్యత్వం నమోదులో తపస్ నాయకులు

నంగునూరు(సిద్దిపేట): విద్యా వ్యవస్థ బలోపేతం కావాలంటే అన్ని ప్రాథమిక పాఠశాల్లో ప్రధానోపాధ్యాయులను నియమించాలని తపస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీరకాయల తిరుపతి అన్నారు. సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నంగునూరు మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాన్ని వెంటనే ప్రకటించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలు విద్యా వ్యవస్థకు పట్టుకొమ్మలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు నియామకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రఘువర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జయపాల్‌యాదవ్, కార్యదర్శి రాములు, జిల్లా కార్యదిర్శి శ్రీనివాస్‌రెడ్డి, రామిరెడ్డి, పర్శరాములు, గోవర్ధన్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

అక్షర యోధుడు కాళోజీ



దుబ్బాకటౌన్‌లో..



వర్గల్(గజ్వేల్)లో..



హుస్నాబాద్‌లో..

కాళోజీ సేవలు మరవలేనివని వక్తలు అన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకొని జిల్లాలో తెలంగాణ భాషా దినోత్సవం నిర్వహించారు. ఆయన చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ కోసం జీవితాన్ని ధారపోసిన అక్షర యోధుడు కాళోజీ అని కొనియాడారు. ఎన్ని భాషలు నేర్చుకున్న తెలుగు భాషను మరిచిపోవద్దన్నారు. అన్ని భాషల్లో మాతృభాష గొప్పదన్నారు. కాళోజీ రచించిన రచనలు ఎంతో గుర్తింపు పొందాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పద్య పోటీలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రినిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

– నెట్‌వర్క్



దుబ్బాక: డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భవాని



జగదేవ్‌పూర్(గజ్వేల్)లో..



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)లో..



సిద్దిపేట ఎడ్యుకేషన్ ...

సంక్షిప్త వార్తలు

◆ విరాళాల సేకరణ

హుస్నాబాద్: వరద బాధితుల సహాయార్థం ఈనెల 13న విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జన జాగృతి కళాసమితి అధ్యక్షుడు ముక్కెర సంపత్ కుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని పెద్దమ్మ ఆలయ ఆవరణలో పలువురు కళాకారులు, కవులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదల్లో చిక్కుకొని అనేక ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి విరాళాల సేకరణ కార్యక్రమం ప్రారంభిస్తామని తెలిపారు. బియ్యం, డబ్బులు, దుస్తులు సేకరించి బాధితులకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహిత్య వేదిక అధ్యక్షుడు రాజ్‌కుమార్, స్నేహ జానపద కల్చరల్ అధ్యక్షుడు తిప్పర్తి శ్రీనివాసులు, కళాకారులు సురేశ్, చిన్న, బాలు, శ్రీకాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

◆ దాడులను అరికట్టాలి

సిద్దిపేటజోన్: దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవి కుమార్ అన్నారు. సీఐటీయూ పిలుపు మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ కార్మికులతో సంతకాల సేకరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని ఆరోపించారు. మహిళ రక్షణ చట్టాలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడంలో విఫలం చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

◆ పీసీసీ అధ్యక్షుడిని కలిసిన రాజిరెడ్డి



చేర్యాల(సిద్దిపేట): నూతన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌ను పీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

◆ ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైనట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దూళ్మిట్ట మండల కేంద్రానికి చెందిన మెరుగు సంజనకు దూళ్మిట్ట గ్రామశివారులో 1.06 గుంట భూమి ఉంది. ఈనెల 7న తన భూమిలో పని చేస్తుండగా ఫెన్సింగ్‌ను ఇదే గ్రామస్తులు నాగిళ్ల మహేశ్‌రెడ్డి, కునబోయిన రవి, నాగిళ్ల బుచ్చిరెడ్డిలు కూలగొట్టారు. తనను, భర్తను, అసభ్య పదజాలంతో తిడుతూ కులం పేరుతో దూషించారని ఆమె ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

◆ ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం: ఏఓ

దుబ్బాకటౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంట వివరాలను వ్యవసాయ అధికారులు నమోదు చేసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపిస్తున్నామని రాయపోల్ ఏఓ నరేశ్ అన్నారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంలో వర్షాలకు దెబ్బతిన్న, నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయ అధికారులు నష్ట వివరాలను నమోదు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు ప్రవీణ్, రజిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

◆ వరద బాధితులను ఆదుకోవాలి

దుబ్బాక: కురుస్తున్న భారీ వర్షాలతో నష్టపోయిన బాధిత కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ అన్నారు. సోమవారం పట్టణంలో వరద బాధితుల కోసం సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలను సేకరించారు. భారీ వర్షాలతో ఖమ్మంతో పాటు చాలా జిల్లాల్లో వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యారన్నారు. వేల ఎకరాల్లో పంటలు నష్టపోయారన్నారు.కార్యక్రమంలో సీపీఎం నాయకులు భాస్కర్, రాజు, మహేశ్, తదితరులు ఉన్నారు.

◆ నూతన కమిటీ నియామకం

దుబ్బాకటౌన్: భారతీయ కిసాన్ సంఘ్ రాయపోల్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గల్వ ఉపేందర్ రెడ్డిని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు కూరెల్లి జస్వంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంలో నూతన కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా జీడిపల్లి బాల్‌రెడ్డి, కార్యదర్శిగా సోమని ఇస్తారి, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన మండల అధ్యక్షుడు గల్వ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతుగా బాధ్యతాయుతంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ మహిళా నాయకురాలు గాడిపల్లి అరుణ, మామిడిపల్లి రేణుక, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

◆ దరఖాస్తులు ఆహ్వానం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సహాయ వంట మనిషి పోస్టు భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ జోగు ప్రభుదాసు తెలిపారు. మండలానికి చెందిన మహిళయి ఉండి 7వ తరగతి చదివి ఉండాలని తెలిపారు. ఏడో తరగతి సర్టిఫికెట్, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈనెల 10 నుంచి 13 వరకు బాలికల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్‌కు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

జర్నలిజం ముసుగులో బెదిరిస్తే సహించం

సిద్దిపేటకమాన్: ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిజం ది కీలక పాత్ర అని టీయూడబ్ల్యూజేఐజేయు జిల్లా శాఖ అధ్యక్షుడు రంగాచారి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సహచర జర్నలిస్టు మిత్రులతో కలిసి ఆయన మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న మంచి, చెడులను విశ్లేషించి ప్రజలకు సమాచారం అందించడం జర్నలిస్టుల ప్రధాన బాధ్యత అన్నారు. పత్రికా, మీడియా స్వేచ్ఛ ముసుగులో కొందరు వ్యక్తులు వసూళ్లకు పాల్పడుతున్నారని ఇది నిజమైన జర్నలిజం కాదన్నారు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బెదిరింపులకు పాల్పడే వ్యక్తుల సమాచారాన్ని సిద్దిపేట ప్రెస్‌క్లబ్ లేదా జర్నలిస్టుల సంఘం దృష్టికి తీసుకురావాలని కోరుతున్నామన్నారు. వృత్తిని నిబద్ధతతో నిర్వహిస్తూ సమాజంలో మంచి, చెడులను బహిర్గతం చేస్తున్న నిజమైన జర్నలిస్టులపై ఎవరైనా దాడులు, బెదిరింపులకు గురి చేస్తే చూస్తూ ఊరుకోమని, వారి పట్ల కఠినంగా వ్యవహరించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రఘునందన్ స్వామి, సంజీవరెడ్డి, దుర్గారెడ్డి, రాజు పాల్గొన్నారు.